సాక్షి తిరుపతి

బుధవారం । 12 । జూన్ । 2024



కఠిన చర్యలు

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్పీఎఫ్ సీఐ మధుసూదన్ హెచ్చరించారు. - 8లో



టీ-20 విజేత కడప

అంతర్ జిల్లాల ఏసీఏ సౌత్ జోన్ సీనియర్ మెన్ టీ 20 క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జిల్లా విజేతగా నిలిచింది. - 8లో



ఆరని మంటలు

ఏపీఐఐసీ పారిశ్రామిక వాడ మాంబట్టులోని అనధికారిక డంపింగ్ యార్డులో తలెత్తిన మంటలు మంగళవారం వరకు తగ్గలేదు. - 8లో

చదువుకొనాల్సిందే..!



• చిత్తూరులోని కొంగారెడ్డిపల్లెకు చెందిన సంతానం అనే వ్యక్తి తన బిడ్డకు ఒకటో తరగతిలో అడ్మిషన్ కోసం పుత్తూరు రోడ్డులోని ఎస్టేట్ వద్ద ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలకు వెళ్లాడు. ముందుగా ఫీజు ఎంత అవుతుందని ఆరా తీశాడు. ఆ పాఠశాల సిబ్బంది ఒకటో తరగతికి రూ.50 వేలు అవుతుందన్నారు. పుస్తకాలకు అదనంగా రూ.20 వేల వరకు కట్టాల్సి ఉంటుందని సమాధానమిచ్చారు. ఫీజుల వివరాలు విన్న సంతానం అవాక్కయ్యాడు.

• తిరుపతిలోని మంగళంలో నివసించే విజయరామరాజు తన కుమారుడు సందీప్‌ను ఎయిర్‌బైపాస్ రోడ్డులో ఉన్న ఓ కార్పొరేట్ పాఠశాలలో చేర్పించేందుకు వెళ్లాడు. 5వ తరగతి అడ్మిషన్‌కు ఎంతవుతుందని ఆరా తీశాడు. ఫీజు కింద రూ.80వేలు కట్టాల్సి ఉంటుందని సదరు స్కూల్ సిబ్బంది తెలిపారు. పుస్తకాలు, యూనిఫామ్ ఇతరత్రా వాటికి మరో రూ.30వేలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో విజయరామరాజు ఖంగుతిన్నాడు.

జూన్ వచ్చిందంటే తల్లిదండ్రులకు టెన్షన్ మొదలవుతోంది. ప్రైవేట్ బడుల దోపిడీకి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అక్కడ చదువు 'కొనాలంటే' వేలకు వేలు వెచ్చించాల్సిన దుస్థితి దాపురించింది. బిడ్డ భవిష్యత్ కోసం తమ జీవితాలను అప్పుల పాలు చేసుకోవాల్సి వస్తోంది. కార్పొరేట్ స్కూళ్లలో చేర్పించి ఫీజులు కట్టలేక మానసిక ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తోంది. పేరెంట్స్ బలహీనతను ఆధారంగా చేసుకుని ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచేస్తున్నాయి. పుస్తకాలు.. బ్యాగులు.. యూనిఫామ్ పేరిట అందినకాడికి యథేచ్ఛగా దోచుకుంటున్నాయి.

- ఫీజులు పెంచేసిన కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు
- పుస్తకాల పేరిట అదనపు దోపిడీ
- తల్లిదండ్రులపై మరింత భారం
- దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్న పేరెంట్స్

ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ బడుల సమాచారం

ప్రాథమిక పాఠశాలలు	459
ప్రాథమికోన్నత పాఠశాలలు	251
ఉన్నత పాఠశాలలు	467
విద్యార్థులు	2,54,421

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే రోజులు పోయి చదువుకొనాల్సిన రోజులు వచ్చాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు వెళుతున్న తల్లిదండ్రులు ఫీజుల వివరాలు తెలుసుకుని బెంబేలెత్తిపోతున్నారు. నర్సరీలో చేర్పించాలంటే ఒక్కో విద్యార్థికి కనీసం రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. పాఠశాలల్లో ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫామ్ తదితర ఖర్చులకు దాదాపు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అవసరమవుతోందని వెల్లడిస్తున్నారు. ఈ సమస్య కారణంగా జూన్ వచ్చిందంటే సామాన్య...మధ్యతరగతి ప్రజలు హడలెత్తిపోతున్నారు.

రేపే బడుల పునఃప్రారంభం

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఈ నెల 13వ తేదీన బడులు పునఃప్రారంభం కానున్నాయి. ఇదే అదనుగా భావించిన ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలవారు ఫీజుల పేరుతో దోచుకునేందుకు సిద్ధమయ్యారు. డబ్బే పరమావధిగా భావించి తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలు మొదటి టర్మ్ ఫీజులు సైతం వసూలు చేసేశాయి. మరికొన్ని పాఠశాలలు టెక్నో, ఐఐటీ, ఒలింపియాడ్ అంటూ ఎక్కువ ఫీజులు వసూళ్లు చేసేందుకు రెడీ అయ్యాయి. దీంతో ఏటా విద్యా ఖర్చు తల్లిదండ్రులకు మోతెక్కిపోతోంది. ఫీజులతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, బ్యాగులు, క్యారేజీ బ్యాగులు, బూట్లు, యూనిఫామ్, బస్సు రవాణాకు చెల్లించాల్సిన డబ్బు అదనంగా ఖర్చవుతోంది. ఈ ఏడాది కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు 15 నుంచి 25 శాతం వరకు పెంచేశారు. పాఠ్యపుస్తకాల ధరలు సైతం 20 నుంచి 25 శాతం పెరిగాయి. విద్యాసంస్థల బస్సుల ఫీజులు సైతం గత ఏడాది కంటే రూ.750 వరకు పెంచేశారు.

కార్పొరేట్ బాటలో..

కార్పొరేట్ సంస్థలను చూసి సెమీ కార్పొరేట్, కొన్ని ఏ గ్రేడ్ ప్రైవేట్ పాఠశాలలు సైతం ఫీజులను పెంచేశాయి. ఈ క్రమంలోనే ముందస్తుగానే ఫీజు కట్టించుకుంటున్నాయి. అడ్మిషన్‌లు రాయించుకోవాలని ఒత్తిడి చేసి పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే యాజమాన్యాలవారు తల్లిదండ్రులకు ఫోన్లు చేసి హుకుం జారీచేస్తున్నారు. లేకపోతే మీ పిల్లల టీసీలు తీసుకుపోండి అంటూ ఒత్తిడి చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు ఫీజు కట్టి అడ్మిషన్ రాయించుకుంటున్నారు. ఈ ఏడాది పెరిగిన ఫీజులతో తల్లిదండ్రులపై దాదాపు రూ.100 కోట్లకు పైగా అదనపు భారం పడుతున్నట్లు అంచనా. చాలా వరకు కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలు కాకుండా సొంత పుస్తకాలను అమ్మడం మొదలు పెట్టారు. విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రైవేట్ వలలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దింది. కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించింది. ఇంగ్లిష్ మీడియంలో బోధన ప్రవేశపెట్టింది. విద్యార్థులను నాణ్యమైన విద్యను అందించింది. అయినప్పటికీ చాలా మంది తల్లిదండ్రులు అనవసరంగా ప్రైవేట్ పాఠశాలల వలలో చిక్కుకుంటున్నారు. అక్కడ ఏదో చెప్పేస్తారు.. తమ పిల్లలకు ఏదో నేర్పించేస్తారనే అపోహతో అధిక ఫీజులు చెల్లించి మరీ ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. చివరకు అప్పుల పాలవుతున్నారు.

30 శాతం పెరుగుదల

గత ఏడాది రూ.60 ఉన్న నోటు పుస్తకం ధర ఈ ఏడాది రూ.90 పైమాటే. గత ఏడాది ఆరో తరగతి విద్యార్థులకు సరాసరిగా రూ.8 వేల వరకు నోటు, పాఠ్యపుస్తకాలకు ఖర్చు అయ్యేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పుడు పెరిగిన ధరతో రూ.11,500 వరకు వెచ్చించాల్సి వస్తోందని వెల్లడిస్తున్నారు. దీంతో పాటు పెన్నులు,పెన్సిళ్లు, ఇతరత్రా వస్తువులు కొనుగోలు అదనం. అలాగే స్కూలు బ్యాగ్, బూట్లు, యూనిఫామ్, టై పేరిట అదనపు భారం పడుతుంది. గత ఏడాది కంటే ఒక్కో విద్యార్థిపై సరాసరిగా రూ.3500 అదనపు ఖర్చు పెరిగి, దాదాపు రూ.46 కోట్లు భారం తల్లిదండ్రులపై పడుతోంది.

ఇష్టారాజ్యంగా ఫీజులు



విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ బడులు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కార్పొరేట్ యాజమాన్యాలవారు ఫీజులు వసూలు చేయాలన్న నిబంధన ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. గత ఏడాది కంటే అధికంగా ఫీజులు పెంచేశారు. తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తే ఆందోళనలు చేపడతాం.

– శశికుమార్, విద్యార్థి సంఘం నేత, తిరుపతి

నోటీసు బోర్డులో పెట్టాలి



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ స్కూల్ నిర్వాహకులు తప్పనిసరిగా ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. అయితే ఎక్కడా పెట్టడం లేదు. రూ.లక్షల కొద్దీ ఫీజులను తల్లిదండ్రుల ముక్కు పిండి వసూలు చేసుకుంటున్నారు. పాఠశాలల్లో నోటుపుస్తకాలు, విద్యాసామాగ్రి అమ్మడానికి వీల్లేదు. అయినప్పటికీ అన్ని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అమ్ముతున్నారు. ఇవి తెలిసినప్పటికీ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇలాగే వ్యవహరిస్తే ఆందోళనకు దిగుతాం.

– సద్దాం, విద్యార్థి సంఘం నేత, చిత్తూరు

న్యూస్‌రీల్

సీఎం ప్రమాణస్వీకారానికి భారీ ఏర్పాట్లు



కలెక్టరేట్‌కు ప్రత్యేక విద్యుత్ అలంకరణ

తిరుపతి అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ప్రత్యేక ప్రసార వీక్షణకు అధికారులు ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ రెండు రోజుల క్రితమే ఆదేశించారు. ఆ మేరకు జిల్లాలోని 138 ప్రదేశాల్లో అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. నియోజకవర్గంలోని ప్రధాన కేంద్రంతోపాటు మండల కేంద్రాల్లో ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. అలాగే తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుని ఒక్కో నియోజకవర్గం నుంచి నాలుగు బస్సులను ఏర్పాటు చేసి, అందులో పార్టీ నేతలు, కార్యకర్తలు, స్థానికులను విజయవాడకు తీసుకువెళ్లారు. బస్సుల ఏర్పాట్లకు సంబంధించి ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో నోడల్ అధికారిని ఏర్పాటు చేశారు. బస్సులకు ఫ్లెక్సీలను ఏర్పా టు చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్, ఎస్పీ కార్యాలయంతోపాటు ముఖ్యమైన అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలోను, గూడూరు నియోజకవర్గానికి సంబంధించి సీతారెడ్డి కల్యాణ మండపం, సూళ్లూరుపేటకు ఆర్యవైశ్య కల్యాణ మండపం, వెంకటగిరికి ఎంసీ మీటింగ్ హాల్, శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్ పార్క్, చంద్రగిరికి నారావారిపల్లెలోని సీహెచ్‌సీ మీటింగ్ హాల్‌లో ఏర్పాట్లు చేపట్టినట్టు వెల్లడించారు. అంతేకాకుండా ఎంపీడీఓ సమావేశ మందిరాలు, కమ్యూనిటీ హాళ్లు, పలు గ్రామ పంచాయతీల కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠ శాల భవనాలు, కమ్యూనిటీ కేంద్రాల్లోనూ ఎల్ ఈడీ స్క్రీన్లు, టీవీ, ఇంటర్నెట్, డిష్ సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ పేర్కొన్నారు.

నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రెండు, నాల్గో సెమిస్టర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ తెలిపారు. ఇప్పటికే నిర్దేశించిన అన్ని కేంద్రాల్లో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సుమారు 22 వేల మంది విద్యార్థులు హాజరుకానున్న ఈ పరీక్షలకు వచ్చే నెల 2వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ఆయన వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలోని వనస్థలిలో ఉన్న రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా నడుపుతున్న ఈ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్లు జరుగుతున్నట్లు వెల్లడించారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయ్యి, 18 నుంచి 22 సంవత్సరాల మధ్య యవస్సు కలిగిన యువతీ, యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 20వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు కరకంబాడి సమీపంలోని కేవీకే కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9849951874, 7095688326 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

బతకనేర్చిన బండి!



బండికి రంగులు మారుస్తున్న వ్యాపారి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలో బండి మీద చిరువ్యాపారాలు చేసుకుంటూ పలువురు జీవనం సాగిస్తుంటారు. వీరి అవస్థలు చూడలేక గతంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పలువురి జీవనోపాధి కోసం ఉచితంగా తోపుడు బండ్లను అందజేశారు. ప్రస్తుతం వీటి ద్వారా చాలా మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే మారిన రాజకీయ పరిణామాల దృష్ట్యా బండ్లకు మునుపు వేసిన రంగులు మార్చి ప్రస్తుత అధికార పార్టీ పసుపు రంగును అద్దుతుండడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

స్థానిక బలం మనదే.. ఎవరికీ భయపడొద్దు

- ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఎవ్వరూ వదులుకోవద్దు
- ప్రతి పక్షంలోనూ ప్రజల మంచి కోసమే పనిచేద్దాం
- ఐక్యమత్యంతో దాడులను ఎదుర్కొందాం
- సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆత్మీయ సమావేశంలో చెవిరెడ్డి



సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: 'జగనన్న పరిపాలనలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే.. ప్రజలు మీ అందరినీ ఆశీర్వదించి గెలిపించారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది.. అయినా స్థానిక సంస్థల్లో మన బలం అలాగే ఉంది.. ఎవ్వరు ఎన్ని చేసినా, భయపెట్టినా, ప్రలోభ పెట్టినా ప్రజలు మనకు ఇచ్చిన అధికారాన్ని నిజాయితీగా, నిస్వార్థంగా కొనసాగించాలి.. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఎవరి కోసమో వదులుకోవద్దు.. మీకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నేను మీతోనే ఉంటా.. ప్రతి పక్షంలో కూడా ప్రజలకు సేవ చేయడానికి స్థానిక సంస్థల అండతో మనం దరం సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచించారు. తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట గ్రామంలోని ఆయన నివాసం వద్ద మంగళవారం చంద్రగిరి, రామచంద్రాపురం, పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటలు కూడా గడవకుండానే చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యర్థి పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేయడం అమానుషమన్నారు. అంతేకాకుండా ఇళ్లపై దాడులు చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడం వంటి దుర్మార్గమైన పనులు చేస్తున్నారన్నారని మండిపడ్డారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఎవ్వరూ ఇలా చేయలేదని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులపై జరిగే దాడులను ఐక్యతతో ఎదుర్కోవడానికి అందరూ సిద్ధపడాలన్నారు. ప్రతిపక్షంలో ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయడానికి సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులుగా పదవి పూర్తయ్యే వరకు ప్రజలకు మంచి చేయడానికి తప్ప ఎవ్వరికీ భయపడాల్సిన పనిలేదన్నారు. ప్రజా ప్రతినిదులపై అధికార పార్టీ నేతలు ఎవ్వరైనా దాడులు చేసినా, ఇబ్బంది పెట్టినా కేంద్ర మానవ హక్కుల సంఘం, రాష్ట్ర మానవ హక్కుల సంఘం, సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అధికారం చేతిలో ఉంది కదా అని ఏమైనా చేస్తారన్న ఆలోచన నుంచి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు బయటకు రావాలన్నారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీలదే రాజ్యాధికారం అన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. అనంతరం అన్ని మండలాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలతో ఆత్మీయ విందు భోజనం చేశారు.



చిన్నగొట్టిగల్లు మండల నేతల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

చంద్రబాబు పర్యటనకు పటిష్ట భద్రత

- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రేణిగుంట/తిరుమల: రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం బుధవారం రాత్రి తిరుమల వెంకన్న దర్శనార్థం విచ్చేయనున్న నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లను చేపట్టనున్నట్లు జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు. 12వ తేదీన రాత్రి 7.45 గంటలకు చంద్రబాబు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుమలకు వెళ్లి రాత్రి అక్కడే బసచేసి ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన ఏర్పాట్లను మంగళవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు రేణిగుంట విమానాశ్రయంలో పరిశీలించారు. ఆయన రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుపతి మీదుగా ఘాట్‌రోడ్డు, తిరుమల, గాయత్రి అతిథి గృహం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, శ్రీవారి ఆలయం వరకు రోడ్డు మార్గాన తనిఖీలు చేపట్టారు. విమానాశ్రయం నుంచి తిరుమల వరకు సీఎం పర్యటన మార్గంలో రోడ్డుకు ఇరువైపులా డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీం, సాయుధ ప్రత్యేక బృందాలతో ముమ్మర తనిఖీలు చేపట్టారు. విమానాశ్రయం లోపల వీఐపీ గేటు, పార్కింగ్ ప్రదేశం, గ్యాలరీలను పరిశీలించారు. పోలీసు, ఎయిర్‌పోర్ట్ భద్రతా సిబ్బంది పాటించాల్సిన బందోబస్తు ప్రణాళికలను అధికారులకు వివరించారు. కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు నిర్దేశిత పార్కింగ్ ప్రదేశంలో వాహనాలను పార్కింగ్ చేయించి యాత్రికులకు, విమాన ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చంద్రబాబు పర్యటించనున్న ప్రదేశాల్లో ఆయన తనిఖీలు చేసి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. సీఎం పర్యటన ప్రారంభం నుంచి ముగిసే వరకు విధి నిర్వహణలో ఎక్కడా అలసత్వం లేకుండా సిబ్బంది పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ నరసింహరాజు, అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, డీఎస్పీలు వెంకటాద్రి, భవ్యకిషోర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



రేణిగుంట విమానాశ్రయం వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

సైబర్ క్రైమ్ ఫిర్యాదులపై స్పందించాలి

- పోలీస్ సాంకేతిక నిపుణుల సమీక్ష సమావేశంలో ఎస్పీ

తిరుపతి క్రైమ్: జిల్లాలో సైబర్ క్రైమ్ ఫిర్యాదులపై సకాలంలో స్పందించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కంట్రోల్ రూమ్, ఐటీ కోర్, సైబర్ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సైబర్‌క్రైమ్ జరిగిన తర్వాత గోల్డెన్ అవర్స్ 24 గంటల్లోగా అందిన సైబర్ క్రైమ్ ఫిర్యాదుపై తక్షణమే దృష్టి సారించాలన్నారు. అలా చేయడం వల్ల బాధితులకు వెంటనే రీఫండ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. మొబైల్ హంట్ పనితీరు బాగానే ఉందని ప్రశంసించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌కు, సైబర్ క్రైమ్ ఆఫీస్‌కి వచ్చి ఫిర్యాదులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

గంగమ్మా..మరువలేమమ్మా!



వివిధ పండ్లతో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



వివిధ వేషధారణలతో మొక్కు తీర్చుకుంటున్న రంగస్థలి కళాకారులు

- మరు పొంగళ్లతో పోటెత్తిన భక్తజనం

తిరుపతి కల్చరల్: 'చల్లంగా చూడు గంగమ్మ తల్లీ'.. అంటూ భక్తజనం మంగళవారం ప్రత్యేక అలంకరణలో కొలువైన శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తిరుపతి గంగజాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గంగజాతర తర్వాత వచ్చిన మూడో మంగళవారం కావడంతో కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన గంగమ్మ పట్ల భక్తిప్రపత్తులతో భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద వేకువ జాము నుంచే భక్తుల సందడి మొదలైంది. భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకుని, పొంగళ్లు పొంగించారు. ఆ తర్వాత అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మంగళవారం ఉదయం ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం వివిధ రకాల పండ్లతో గంగమ్మ తల్లిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జాతర వేషాలతో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు వేయి కళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకుని ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడిలో భాగంగా భక్తులు ఆలయం వద్ద భక్తులకు అంబలి పోసి, ప్రసాదాలు వితరణ చేశారు. మొక్కుబడిలో భాగంగా మంగళవారం రంగస్థలి కళాకారులు వివిధ వేషధారణలో గంగమ్మ ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్ రాజా, సభ్యులు పాల్గొన్నారు.



వేయికళ్ల దుత్తలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

ఎంసెట్ ఫలితాల్లో నారాయణ విజయకేతనం



ఎంసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ ఎంసెట్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని నారాయణ విద్యాసంస్థ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించిచారు. ఎంసెట్ ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షా ఫలితాల్లో ఆర్.పుష్కర్ రాష్ట్ర స్థాయిలో 17వ ర్యాంకు, దినేష్ ప్రసాద్ 116, శ్రీవివస్వత 141, వివేకానంద 172, ప్రకాష్ 212, జ్యోష్మిత 227, హితేష్ 249, తన్మయ్‌కృష్ణ 362, సాయిప్రసన్న 593తో పాటు మొత్తం 17 మంది విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు సాధించినట్లు ఆ విద్యాసంస్థ కోర్‌డీన్ శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షకు హాజరైన తమ విద్యార్థులు అత్యధికమంది ఇంజినీరింగ్ సీట్లు సాధించే ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. అనంతరం వారిని ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ఏపీ ఎంసెట్ ఫలితాల్లో మెరుపులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు మే 16 నుంచి 23వ తేదీ వరకు ఇంజినీరింగ్, బైపీసీ స్ట్రీమ్‌లలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లలో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లా నుంచి హాజరైన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. ఇంజినీరింగ్ విభాగంలో జిల్లాకు చెందిన రాయపాటి పుష్కర్ రాష్ట్ర స్థాయి 17వ ర్యాంకు, గునకల పియూష్ ప్రణవ్ 38, జే.శ్రీవివస్వత్ 141, నాగోలు యశ్వంత్‌కుమార్‌రెడ్డి 151, సిద్ధగుంట అభిరామిరెడ్డి 161, సిద్ధార్థి వివేకానంద్ 172, పీ.ప్రకాష్ 212, గుండా జోష్మిత 227, పేటేటి దివ్యపూర్ణచంద్ 233, శెట్టిపల్లి సాయిశ్వేత 354వ ర్యాంకు సాధించారు. అలాగే అగ్రికల్చర్ విభాగంలో వడ్లపూడి ముఖేష్‌చౌదరి రాష్ట్ర స్థాయి 3వ ర్యాంకు, పీఎస్.యస్మిత 103, జీఆర్.కీర్తన్‌రెడ్డి 197వ ర్యాంకు సాధించారు.

వేద విజ్ఞానానికి నిలయం వేదిక్ వర్సిటీ

- యూజీ, పీజీ అడ్మిషన్లకు 15 వరకు దరఖాస్తుల ఆహ్వానం
- తాళపత్ర గ్రంథాల సంరక్షణ, పరిశోధనే ధ్యేయం
- భావితరాలకు వేద విజ్ఞానం అందించే ప్రయత్నం
- పరిశోధనలకు పెద్దపీట
- ఎస్వీ వేదిక్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి



వేదిక్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ పరిపూర్ణ వేద విజ్ఞానానికి నిలయమని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి తెలిపారు. వేదాల్లోని సారాంశాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు వర్సిటీ పనిచేస్తుందన్నారు. వేదిక్ వర్సిటీలో ఏడు వేదాల్లోని పరిజ్ఞానాన్ని నిష్ణాతులైన అధ్యాపకులచేత విద్యార్థులకు బోధిస్తున్నామని చెప్పారు. భావిభారతావనికి వేద విజ్ఞానాన్ని అందించేందుకు వర్సిటీ అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటుందన్నారు. యావత్ భారత దేశంలో వేద విద్యను సంపూర్ణంగా అందిస్తున్న ఏకైక విశ్వవిద్యాలయం ఎస్వీ వేదిక్ వర్సిటీనే అని పేర్కొన్నారు. 2024–25 అకడమిక్ అడ్మిషన్ల ప్రక్రియ నేపథ్యంలో వర్సిటీలోని కోర్సుల వివరాలు, అర్హతలు, ఉపాధి అవకాశాలపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

యూజీ, పీజీ అడ్మిషన్లకు 15న చివరి గడువు

వర్సిటీలో ప్రధానంగా 21 విభాగాల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇందులో యూజీ (శాస్త్ర) కోర్సులకు సంబంధించి వేద విభాగంలో రుగ్వేద, క్రిష్ణ యజుర్వేద, శుక్ల యజుర్వేద, సామవేద, అధర్వణ వేదంలోనూ, ఆగమశాస్త్రం విభాగంలో వైఖానస ఆగమం, పంచరత్రగామం, శైవాగమంలోనూ, పౌరోహిత్యం విభాగంలో అశ్వాలయన, అపస్తంభ, పరస్కర, వైఖానస పౌరోత్యంలోనూ, వేదభాష్యంలోని 5 విభాగాలలో, కల్ప, మీమాంస విభాగాల్లో అడ్మిషన్లు చేపడుతున్నాం. ఇందులో ఒక్కో విభాగంలో 15 సీట్లు భర్తీ చేస్తున్నాం. అదేవిధంగా పీజీ(ఆచార్య) కోర్సులకు సంబంధించి వేదాల్లో ఐదు విభాగాల్లోనూ, ఆగమశాస్త్రంలో మూడు విభాగాల్లోనూ, పౌరోహిత్యంలో నాలుగు విభాగాల్లో, వేదభాష్యంలో ఐదు విభాగాల్లో, మీమాంస, కల్పన వంటి పీజీ కోర్సులలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానించాం. పీజీ కోర్సులలో ఒక్కో విభాగానికి 10 సీట్లు భర్తీ చేయనున్నాం. దీంతో పాటు ఏదేని డిగ్రీ కలిగి సంస్కృతంపై పట్టు ఉన్నవారి కోసం డిప్లొమో కోర్సులను ప్రవేశపెట్టాం. ఇందులో టెంపుల్ మేనేజ్‌మెంట్, జోతిష్యం, వాస్తు, మ్యాన్‌స్క్రిప్ట్‌కోర్సులను అందిస్తున్నాం. వీటితో పాటుగా ఇంటర్ విద్య పూర్తి చేసి సంస్కృతం పరిజ్ఞానం ఉన్న వారి కోసం ఏడు విభాగాలలో సర్టిఫికెట్ కోర్సును అందిస్తున్నాం.

ఉపాధి కల్పనే లక్ష్యంగా అడుగులు

దేశంలోనే ఏకైక వేదిక్ వర్సిటీగా పిలువబడే టీటీడీ సంస్థ వేదిక్ వర్సిటీలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు వంద శాతం ఉపాధి, ఉద్యోగాలు పొందుతున్నారు. ప్రధానంగా వర్సిటీలో వేద, ఆగమ, పౌరోహిత్యంలో పలు కోర్సులను అందిస్తున్నాం. విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న విభాగంలో మరింత పట్టు సాధించేందుకు నిపుణులైన అధ్యాపకులచే బోధన అందిస్తున్నాం. వర్సిటీలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. దేశానికే తలమానికమైన అయోధ్యలో నిర్మించిన రామమందిర్‌లో వర్సిటీ నుంచి ఇద్దరు విద్యార్థులు పనిచేస్తుండడం గర్వంగా ఉంది. అదేవిధంగా దేశ, విదేశాల్లోని పలు ఆలయాల్లో పండితులుగాను, వేద అధ్యాపకులుగాను, ఆగమశాస్త్ర నిపుణులుగా రాణిస్తున్నారు. వర్సిటీలో కోర్సు పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి స్థిరపడ్డారు. ఇది జీవితంలో సంతోషించదగ్గ విషయం.

తాళపత్ర గ్రంథాల సంరక్షణ, డిజిటలైజేషన్

వేదిక్ వర్సిటీలో ప్రాచీన తాళపత్ర గ్రంథాల సంరక్షణ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశాం. తాళపత్ర గ్రంథాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకుని సిబ్బంది పనిచేస్తున్నారు. ఇప్పటికే పలు జాతీయ సంస్థలతో ఈ ప్రక్రియపై ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. వేదాల్లోని జ్ఞానాన్ని ప్రపంచానికి అందించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించి పరిశోధనలు చేస్తున్నాం. ప్రాచీన తాళపత్రాలు ఏ ప్రాంతం నుంచి వచ్చినా డిజిటలైజేషన్ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నాం. దీంతో పాటు వేదిక్ నాలెడ్జ్‌ను అందించేందుకు ప్రముఖ జాతీయ విద్యాసంస్థలైన ఐఐటీ, ఐఐఎం, ఐజర్‌తో పలు అంశాలపైన కలసి పనిచేస్తున్నాం.

మద్యం మత్తులో వ్యక్తి హత్య

- గొంతుపై కాలితో తొక్కి హత్య
- కేసు నమోదు చేసిన తిరుచానూరు పోలీసులు



మృతి చెందిన అమర్‌నాథ్

చంద్రగిరి(తిరుచానూరు): మద్యం మత్తులో ఓ యువకుడు గొంతుపై కాలితో తొక్కి హత్యకు పాల్పడిన ఘటన తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని బొమ్మల క్వార్టర్స్ రిక్షా కాలనీ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఎర్రవారిపాళెం మండలానికి చెందిన అమర్‌నాథ్(30) తన భార్య లక్ష్మీతో కలిసి కరకంబాడి సమీపంలోని అన్నసాంపల్లిలో నివాసం ఉంటూ బొమ్మల క్వార్టర్స్ సమీపంలో మేస్త్రీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి పనులు ముగించుకుని బొమ్మల క్వార్టర్స్ వద్ద ఉన్న ఓ షెడ్డులో తోటి మేస్త్రీలతో కలసి మద్యం సేవించాడు. ఈ క్రమంలో అమర్‌నాథ్ మరో మేస్త్రీ రాజుదొరై మధ్య వివాదం ఏర్పడింది. దీంతో రాజుదొరై, అమర్‌నాథ్ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కొన్నాడు. అమర్‌నాథ్ తన నివాసానికి చేరుకుని జరిగిన ఘటనను తన భార్య లక్ష్మీకి వివరించడంతో.. ఇద్దరూ కలిసి బొమ్మల క్వార్టర్స్‌లోని షెడ్డు వద్దకు చేరుకున్నాడు. ఈ క్రమంలో మరోసారి రాజుదొరై, అమర్‌నాథ్ మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో రాజుదొరై అమర్‌నాథ్‌పై దాడికి పాల్పడ్డాడు. అమర్‌నాథ్ కింద పడిపోవడంతో అతని గొంతుపై రాజుదొరై కాలుపెట్టి గట్టిగా తొక్కడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు మృతుడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. హత్యకు పాల్పడిన రాజుదొరై కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు.

ఎంసెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయకేతనం



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య విద్యాసంస్థ జోనల్ ఏజీఎం, డీన్‌లు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ ఎంసెట్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని శ్రీచైతన్య విద్యాసంస్థ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఎంసెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫలితాల్లో పీఎస్.యశ్మిత రాష్ట్ర స్థాయి 103వ ర్యాంకు, బీ.చరిష్మా 132, జీ.రాజకీర్తనరెడ్డి 197, ఎస్.బ్రహ్మతేజ 373, సయ్యద్‌సోహ 399, పీ.సాత్విక 468, ఎం.వెంకటకల్పన 520, బీ.దివ్య 605, ఏ.సాయితేజ 781, కే.నందిని 884, కే.జీవన్‌కుమార్ 889, బీ.జిషిత 918వ ర్యాంకులు సాధించారు. వీరితో పాటు పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి విజయబావుట ఎగురవేశారని ఆ విద్యాసంస్థ జోనల్ ఏజీఎం బీవీ.ప్రసాద్ తెలిపారు. అనంతరం విద్యార్థులను డీన్‌లు కేఎల్‌జీ.ప్రసాద్, రామమోహమ్‌రావు, భాస్కర్, కుమార్ అభినందించారు.

రసరమ్యం..
అయోధ్యకాండ అఖండ పారాయణం



అఖండ పారాయణంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామికి హారతిస్తున్న అర్చకులు

తిరుమల: లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై మంగళవారం ఉదయం జరిగిన 11వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది. అయోధ్యకాండలోని 40 నుంచి 44వ సర్గ వరకు మొత్తం నాలుగు సర్గల్లో 159 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 184 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేద పాఠశాల పండితులు రామానుజాచార్యులు, అనంత గోపాలకృష్ణ, మారుతి శ్లోక పారాయణం చేశారు. అఖండ పారాయణంలో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థకు చెందిన వేదపారాయణదారులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్ర పండితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు శ్రీనివాస్ బృందం సంకీర్తనలను రసరమ్యంగా ఆలపించారు.

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు



రైళ్లలో పిల్లల వివరాలు తెలుసుకుంటున్న ఆర్పీఎఫ్ పోలీసులు

తిరుపతి(అలిపిరి): మానవ అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని.. రైళ్లలో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆర్పీఎఫ్ సీఐ మధుసూదన్ సూచించారు. మంగళవారం తిరుపతిలో పూర్ణా–తిరుపతి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ – తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో గుంతకల్ డివిజన్ రైల్వే రక్షకదళ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సూచనల మేరకు డివిజనల్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పర్యవేక్షణలో మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. ప్రయాణికులతో మాట్లాడి వారి ఆధారాలు, ప్రయాణ వివరాలు, ప్రయాణ ఉద్దేశాన్ని ఆధార్ కార్డులతో ధ్రువీకరించారు. పిల్లలతో మాట్లాడి తల్లిదండ్రులు.. సంరక్షకులతో ఉన్నారని గుర్తించారు. మానవ అక్రమ రవాణాపై ఉచిత నంబర్లు 100, 139కు సమాచారం అందించాలని కోరారు. రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు ఆర్పీఎఫ్ యంత్రాంగం పీఆర్‌కే.రెడ్డి, డీ.రమేష్, డీఎం.సుబాన్, శుభకిరణ్, ఎస్.సుధాకరరావు, టీ.రమేష్‌బాబు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల సీనియర్ టీ-20 విజేత కడప

- ద్వితీయ స్థానంలో నిలిచిన అనంతపురం జట్టు
- ట్రోఫీలు అందజేసిన సౌత్ జోన్ క్రికెట్ జీఎం



విజేతగా నిలిచిన కడప జట్టుతో ఏసీఏ ప్రతినిధులు

తిరుపతి రూరల్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సహకారంతో చిత్తూరు జిల్లా అడహక్ కమిటీ ఆధ్వర్యంలో తుమ్మలగుంట కేవీఎస్ క్రీడా మైదానంలో జరుగుతున్న అంతర్ జిల్లాల ఏసీఏ సౌత్ జోన్ సీనియర్ మెన్ టీ 20 క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జిల్లా విజేతగా నిలిచింది. గత ఐదు రోజులుగా జరుగుతున్న ఈ టోర్నీలో కడప, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. ఒక్కొక్క టీంకు నాలుగు మ్యాచ్‌లు జరగగా అన్ని మ్యాచ్‌ల్లో గెలిచిన కడప జట్టు ఫైనల్ విజేతగా నిలిచి కప్పు కైవశం చేసుకుంది. రన్నర్స్‌గా అనంతపురం జట్టు నిలువగా, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జట్లు వరుసగా 3, 4, 5 స్థానాలలో నిలిచాయి. మంగళవారం కేవీఎస్ క్రికెట్ క్రీడా మైదానంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో విన్నర్స్, రన్నర్స్ జట్లకు సౌత్ జోన్ క్రికెట్ జీఎం ఖాజా మొహిదీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ట్రోఫీలను అందజేశారు. చిత్తూరు జిల్లా అడక్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ శ్రీధర్, సభ్యులు ఎలియాజర్, ఐదు జిల్లాల క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆరని మంటలు

- మాంబట్టు సెజ్‌లో అగ్ని ప్రమాదం
- రెండో రోజూ కొనసాగిన సహాయక చర్యలు
- అడ్రస్ లేని డంపింగ్ యార్డు నిర్వాహకులు



ఎగసి పడుతున్న మంటలు

తడ: ఏపీఐఐసీ పారిశ్రామిక వాడ మాంబట్టులోని ఓ అనధికారిక డంపింగ్ యార్డులో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదం మంగళవారం వరకు తగ్గలేదు. డంపింగ్ స్థలంలో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ చెత్త పేరుకుపోవడంతో పొగ దట్టంగా వ్యాపిస్తోంది. ప్రమాదం జరిగిన సమయం నుంచి మొత్తం ఆరు ఫైరింజిన్లు మంటలను అదుపు చేసేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. మంగళవారం మంగళవారం సాయంత్రం గాలి దిశ మారడంతో దట్టమైన పొగ, ఘాటైన వాసనతో ప్రమాద స్థలానికి ఆనుకుని ఉన్న టైచి అల్యూమినియం కాస్టింగ్ కంపెనీలోకి వెళ్లడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే ఉద్యోగులను బయటకు పంపేశారు. నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సూళ్లూరుపేట సీఐ మధుబాబు, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి రమణయ్య తదితరులు సంఘటనా స్థలం వద్ద రెండు రోజులుగా ఉంటూ సహాయక చర్యలు చేపట్టారు.

వారెక్కడ?

ప్రమాదానికి కారణమైన స్థల యజమాని, స్థలాన్ని లీజుకు తీసుకుని అందులో చెత్తను డంపింగ్ చేసిన వ్యక్తి ఘటనా స్థలానికి రాకపోవడం విమర్శలకు తావిస్తోంది. అత్యంత భద్రత కలిగిన పారిశ్రామిక వాడలో ఎలాంటి అగ్నిమాపక అనుమతులు లేకుండా చెత్త సేకరించి నిల్వ చేయడం విమర్శలకు తావిస్తోంది. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తడ మండల పర్యటనకు వస్తున్న నేపథ్యంలో భద్రతాధికారుల సూచన మేరకు ఫైర్ అధికారులు ఈ డంపింగ్ యార్డు యజమానికి హెచ్చరికలు జారీ చేసినా వాళ్లు దానిని పెడచెవిన పెట్టడం గమనార్హం.

సంధి కాలం.. మరమ్మతులు ముమ్మరం!



తూపిలిపాళెం వద్ద వలలు రిపేరు చేసుకుంటున్న మత్స్యకారులు

వాకాడు: ఏప్రిల్ 14 నుంచి జూన్ 15వ తేదీ వరకు సముద్రంపై వేట నిషేధించడంతో మత్స్యకారులు ఈ సంధి కాలంలో పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు. ఈ క్రమంలో మరమ్మతులకు గురైన తమ వేట సామగ్రిని రిపేర్లు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. వేట తప్ప మరేపనీ తెలియని సంప్రదాయ మత్స్యకారులకు ఈ సారి ఎన్నికల కోడ్ కారణంగా వేట విరామం నగదు రాలేదు. దీంతో 58 రోజులుగా పూట గడవడం కష్టంగా మారింది. మరో మూడు రోజుల్లో వేట విరామ సమయం పూర్తి కానున్న నేపథ్యంలో మత్స్యకారులు తమ వేట సామగ్రిని పూర్తి స్థాయిలో రిపేర్లు చేసుకుని వేటకు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15న శనివారం తెల్లవారు జామున మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లనున్నారు.

జ్ఞానప్రసూనాంబకు ముత్యాల కవచం



ముత్యాల చీర, కిరీటం, వడ్డాణాన్ని అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి అమెరికాకు చెందిన ఐకా రవి, గాయత్రి దంపతులు ముత్యాల చీర, కిరీటం, వడ్డాణం, హస్తం, పాదాలు బహూకరించారు. వీటిని ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగ్గురికి రిమాండ్

తిరుపతి లీగల్ : గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురికి ఈనెల 25వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు మంగళవారం ఆదేశాలు జారీచేశారు. తిరుపతి పంట వీధికి చెందిన ఎం.సాయిశ్రీనివాసులు, తిరుపతి రూరల్ పేరూరు పంచాయతీ ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఈ.జయంత్, తిరుపతి, కట్టకిందఊరు, వెంకట్‌రెడ్డి కాలనీకి చెందిన పీ.రాహుల్ కలిసి తిరుపతి చింతల చెరువు రైల్వే గేట్ సమీపంలో రెండు కిలోల గంజాయిని తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. తిరుపతి ఈస్ట్ పోలీసులు ఆ ముగ్గుర్నీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

బాడీబిల్డింగ్ క్రీడ అభివృద్ధే లక్ష్యం

- ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్



కేక్ కట్ చేయిస్తున్న అసోసియేషన్ నేతలు

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ క్రీడను మరింత అభివృద్ధి చేస్తామని తిరుపతికి చెందిన గోల్డెన్ ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జాతీయ అధ్యక్షుడైన తర్వాత తొలిసారిగా ఆయన వైఎస్ఆర్ జిల్లా కడపలోని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు ఆయనను ఘనంగా స్వాగతించి కేక్ కట్ చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిషత్‌లో పాలకొల్లు, కావలిలో జరిగే రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ ఏడాది క్రీడా పోటీల క్యాలెండర్‌ని కూడా త్వరలో తయారు చేయాలని రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు. వచ్చే నెల నుంచి ప్రతి జిల్లాలో అసోసియేషన్ కార్యాలయాలను సందర్శించి ఆ జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ల అభివృద్ధికి తోడ్పడతానన్నారు. కార్యక్రమంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఈవై.కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్.యునుష్ బాషా, సభ్యులు ఉదయ్, రమణ, రాజా, పాండే, సీనియర్ బాడీ బిల్డర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజు

రేణిగుంట: వర్షాకాలం మొదలు కావడంతో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని మలేరియా కడప జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ త్యారాజు సూచించారు. రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించి ఆరోగ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆశా కార్యకర్తలు నుంచి వైద్యాధికారి వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, చికున్‌గున్యా, మెదడువాపు, జికా వైరస్, బోధకాలు వంటి వ్యాధులపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని చెప్పారు. దోమలు వ్యాప్తి కాకుండా పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపట్టాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తేజశ్విని, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ పాల్గొన్నారు.

టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు అధ్యక్షులుగా అడసలపల్లి వాసు



తిరుపతి(అలిపిరి): టీటీడీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులుగా అడసలపల్లి వాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం టీటీడీ పరిపాలనా భవనంలోని ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ బ్యాంకులో వాసును ఏకగ్రీవంగా డైరెక్టర్లు ఎన్నుకున్నారు. 2019 సెప్టెంబర్‌లో టీటీడీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ బ్యాంకులో ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎన్నికల్లో అడసలపల్లి వాసుతోపాటు ముని వెంకటరెడ్డి, హేమలత, చీర్ల కిరణ్, వెంకటేశం, గుణశేఖర్, శివకుమార్ తోపాటు ఏడుగురు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ఈ ఏడుగురిలో ఒకరికొకరు పరస్పర అంగీకారంతో ఒకటిన్నర సంవత్సరం పాటు అధ్యక్షులుగా కొనసాగేలా తీర్మానించుకున్నారు. అందులో భాగంగానే మొదటి అధ్యక్షులుగా ముని వెంకటరెడ్డి, రెండోసారి అధ్యక్షులుగా హేమలత, మూడోసారి అధ్యక్షులుగా చీర్ల కిరణ్ ఉద్యోగులకు సేవలందించారు. ప్రస్తుతం చీర్ల కిరణ్ పదవీ కాలం పూర్తి కావడంతో ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్న అడసలపల్లి వాసును బ్యాంకు అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈనెల 13న గురువారం టీటీడీ పరిపాలనా భవనంలోని కో–ఆపరేటివ్ బ్యాంకులో వాసు ప్రమాణ స్వీకా రం చేయనున్నారు. అడసలపల్లి వాసు మాట్లాడుతూ తన ప్రమాణ స్వీకారానికి ఉద్యోగ సంఘం నాయకులతో పాటు ఉద్యోగులు, స్నేహితులు హాజరుకావాలని కోరారు.

జిల్లాలో 69.4 మి.మీ వర్షం

తిరుపతి అర్బన్: జిల్లాలో పది రోజులుగా ఓ మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ మొదలైన నేపథ్యంలో చిన్నపాటి వర్షాలు రోజూ కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా 69.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. సూళ్లూరుపేటలో 14.2 మి.మీ, పెళ్లకూరులో 10.6, దొరవారిసత్రంలో 10.2, పాకాలలో 8.6, చిట్టమూరులో 7.4, కోటలో 6.8, నాయుడుపేటలో 5.4, వాకాడులో 3.4, ఓజిలిలో 1.8, పుత్తూరులో 1.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 78,064 మంది స్వామివారిని దర్శించుకోగా 33,869 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.7 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.